ఉంతకల్లు వద్ద హెచ్‌ఎల్సీని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం

◆ 'అనంత'కు టిజి.భరత్

◆ సత్యసాయికు అనగాని సత్య ప్రసాద్

టిజి.భరత్

అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. ఈ మేరకు మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లాకు పరిశ్రమలు, వాణిజ్య ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్‌ను నియమించింది. సత్యసాయి జిల్లాకు రెవెన్యూ, స్టాంపుల రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నియమించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులను ఇతర జిల్లాకు నియమించింది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నంద్యాల జిల్లాకు, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను కడప జిల్లాకు, వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌ను ఎన్టీఆర్ జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రులుగా నియమించింది.

సమన్వయం సాధించేరా ?

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తుంది. అనంతపురం, సత్యసాయి జిల్లాలకు నియమించిన ఇద్దరు మంత్రులు కీలక శాఖలకే మంత్రులుగా ఉన్నారు. ఇన్‌చార్జులు అటు పార్టీని, ఇటు అభివృద్ధి పనులను సమన్వయం చేసుకుంటూ ముందుకుపోవాల్సి ఉంటుంది. అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రిగా నియమితులైన టిజి భరత్ పక్క జిల్లా కర్నూలుకు చెందిన వారు. ఆయనకు ఇక్కడి సమస్యలపై కొంత మేరకు అవగాహన ఉండే అవకాశముంది. సత్యసాయి జిల్లాకు సంబంధించి గుంటూరు జిల్లా రేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అనగాని సత్య ప్రసాద్‌ను నియమించారు. ఈయనకు ఇక్కడి రాజకీయ పరిస్థితులు కొంత కొత్త కావచ్చు. అంతేకాకుండా ఇక్కడున్న నాయకులందరూ సీనియర్లు కావడమే కాకుండా ఆ జిల్లా పరిధిలో ఇద్దరు మంత్రులు ఉన్నారు. పార్టీలోనూ ముఖ్య నేతల మధ్య కొంద దూరం ఉంది.వీటన్నింటినీ ఇన్‌ఛార్జి మంత్రి సమన్వయం పరచి ముందుకు తీసెకెళ్లాల్సి ఉంది.

జిల్లా అభివృద్ధి గాడిన పెట్టేరా ?

జిల్లా అభివృద్ధిని గాడిలో పెట్టే ప్రధాన బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులపై ఉంటుంది. ఇందుకు వారు బాధ్యతలు తీసుకున్న తరువాత జిల్లా అభివృద్ధి (డిఆర్‌సి) సమీక్షలు జరపాల్సి ఉంటుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి జిల్లా అభివృద్ధి సమీక్షలు ఇంకా జరగలేదు. సత్యసాయి జిల్లా వరకు ఇద్దరు మంత్రులు జిల్లా పరిస్థితులు తెలుసుకునేందుకు ఒక సమీక్ష నిర్వహించారు. అనంతపురం జిల్లాలో అటువంటి ప్రయత్నం జరగలేదు. ఇప్పుడు ఇన్‌ఛార్జి మంత్రులు రావడంతో వారి ఆధ్వర్యంలో సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి జరగాల్సి ఉంది.

జలవనరుల అభివృద్ధే కీలకం

◆ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

◆ సాగు,తాగునీటిపై పాలకుల నిర్లక్ష్యం వీడాలి

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

◆ అనంతలో 'సాగునీటి కోసం సిపిఎం బస్సుయాత్ర' ప్రారంభం

◆ ప్రారంభించిన కర్నాటక సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సత్తిబాబు

ప్రజాశక్తి -బొమ్మనహాల్, రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం

జలవనరుల అభివద్ధితోనే అనంతపురం జిల్లా అభివృద్ధి సాధ్యం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలియజేశారు. సాగునీటి కోసం సిపిఎం చేపట్టిన బస్సుయాత్ర మంగళవారం ప్రారంభం అయ్యింది. బొమ్మనహాల్ మండలం ఉంతకల్లు హెచ్‌ఎల్సీ 105 కిలోమీటర్ వద్ద యాత్రను కర్ణాటక సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సత్తిబాబు జెండా ఊపి ప్రారంభించారు. మొదటి రోజు బొమ్మనహాల్, రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో యాత్ర కొనసాగింది. ఆయా మండలాల గ్రామాల్లో సాగునీటి కాలువలను నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టు, భైరిచెరువులను పరిశీలించారు.

సాగునీరు రైతుల హక్కు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రభుత్వాలు సాగునీటిని రైతులకు హక్కులా విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆయకట్టుకు సకాలంలో నీరు విడుదల చేసి, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులే ప్రభుత్వానికి సహాయం చేస్తారన్నారు. తుంగభద్ర జలాశయంలో ప్రతి సంవత్సరం 50 నుంచి 80 టిఎంసిలు వరకు సాగునీరు వృథాగా సముద్రంలోకి వెళ్తోందన్నారు. ఈ నీటిని సక్రమంగా వినియోగించుకుంటే అనంతపురం జిల్లాలో అన్ని చెరువులనూ నీటితో పూర్తి స్థాయిలో నింపొచ్చన్నారు. గత ప్రభుత్వ పాలకులు సాగునీటి సమస్యలను పరిష్కరించకుండా జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందన్న ఉద్దేశంతో ప్రజలు అత్యధిక స్థానాలను గెలిపించారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జిల్లా రైతాంగానికి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వంద రోజుల కూటమి పాలనలో పాలకులకు మద్యం దుకాణాలపై ఉన్న శ్రద్ధ రైతులు, ప్రజల అభివృద్ధిపై లేకపోవడం విచారకరం అన్నారు. ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తిచేసి తుంగభద్ర ఎగువ కాలువ కింద పంటలను సాగు చేస్తున్న రైతులకు సాగునీరు, స్థానికులకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లను అమర్చాలన్నారు. హెచ్‌ఎల్‌సి ఆధునీకరణ పనులను వెంటనే చేపట్టాలని కోరారు. హంద్రీనీవా ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలన్నారు. బిటిపి ఎత్తిపోతల పథకం వెంటనే చేపట్టాలన్నారు. చెరువులు, కుంటలను నీటితో నింపి ఆయకట్టుకు నీరు వదలాలన్నారు. బస్సుయాత్ర సందర్భంగా ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని సాగునీటి కాలువలను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకుంటామని చెప్పారు. ఈ నెల 21వ తేదీన సాగునీటి కోసం కలెక్టరేట్ ఎదుట మహాధర్నాను చేపట్టనున్నట్లు తెలియజేశారు. ప్రజలు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భైరవానితిప్ప ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సాగునీటిపై ప్రభుత్వాలు స్పందించాలి

కర్నాటక సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సత్తిబాబు

పంటల సాగు నిమిత్తం సాగునీరు అందించడంపై ప్రభుత్వాలు స్పందించాలని కర్నాటక సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.సత్తిబాబు డిమాండ్ చేశారు. సిపిఎం బస్సుయాత్ర ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం మరమ్మతుకు సంబంధించి ఆంధ్ర, కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు సాగునీరు అందించే అవకాశం ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో అవి అందని పరిస్థితి నెలకొందన్నారు. సాగునీటిని అందిస్తేనే ఏ ప్రాంతం అయినా సస్యశ్యామలం అవుతుందన్న విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు. సాగునీటి కోసం అనంతపురం సిపిఎం చేపట్టిన ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల రంగయ్య, ఎస్.నాగేంద్ర కుమార్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి ఎం.కృష్ణమూర్తి, ఎం.నాగమణి, రంగారెడ్డి, అచ్యుత్, మల్లికార్జున, నాగరాజు, లోకేష్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పుల్లన్న, లక్ష్మినారాయణ స్థానిక నాయకులు మధు, తిమ్మరాజు అంజి డి.హీరేహల్ మండల కార్యదర్శి లోకేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు శివతో పాటు రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

యాత్రకు స్పందన

సాగునీటి కోసం సిపిఎం చేపట్టిన బస్సుయాత్రకు ప్రజలు, రైతుల నుంచి మంచి స్పందన లభించింది. యాత్ర పర్యటించిన అన్ని ప్రాంతాల్లోనూ రైతులు, హమాలీలు, ఆశా వర్కర్లు, కార్మిక సంఘాలు, విఆర్ఎలు, సర్పంచులు మద్దతు తెలిపారు. సాగునీటి కోసం సిపిఎం చేస్తున్న ఆందోళన న్యాయమైదన్నారు. ఈ పోరాటంలో తామూ భాగస్వామ్యం అవుతామని తెలియజేశారు.

నేడు బస్సుయాత్ర ఇలా..

కాలువపల్లి	–ఉ॥10.30గం॥
జీడిపల్లి	– 11.00గం॥
రామసాగరం	– 11.40గం॥
రాకెట్ల	– 12.20గం॥
అమిదాల	– 1.00గం॥
ఉరవకొండ	– 1.40గం॥
రాగులపాడు	– 2.10గం॥
వజ్రకరూరు	– 3.00గం॥
గుంతకల్లు	– 5.00గం॥

రాయదుర్గంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

రాఘవేంద్ర హోటల్ వద్ద అధికారుల హల్‌చల్

◆ నిబంధనలు పాటించలేదంటూ నోటీసులు

◆ భవన యజమానికి కూడా.. ◆ మద్యం లాటరీనే కారణమా..?

రాఘవేంద్ర హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

పట్టణంలోని జూనియర్ కళాశాల రోడ్‌లో ఉన్న రాఘవేంద్ర హోటల్ వద్ద మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారుల హడావుడి కొనసాగింది. మున్సిపల్ అధికారులందరూ మూకుమ్మడిగా హోటల్ వద్దకెళ్లి తనిఖీలు చేశారు. కమిషనర్ వంశీకష్ణ భార్గవ్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అలీఖాన్, విఆర్ఒ గంగాధర్‌లు పోలీసులతో కలిసి హోటల్‌ను క్షణ్ణంగా తనిఖీ చేశారు. పారిశుధ్యంతోపాటు హోటల్ నిర్వహణకు ట్రేడింగ్ లైసెన్స్ పొందలేదన్న కారణంతో యజమాని దినేష్‌కు నోటీసులు జారీ చేశారు. హోటల్ భవన యజమాని వెలుగు శ్రీనివాస్ మిద్దెపై మున్సిపల్ అనుమతి లేకుండా పెంట్‌హౌస్ నిర్మించడంపై వివరాలు తీసుకున్నారు. నిబంధనల మేరకు భవన నిర్మాణం జరిగిందా.. లేదా అన్న దానికి సంబంధించిన అన్ని పత్రాలూ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. సరైన పత్రాలు ఇవ్వకుంటే భవనాన్ని కూల్చివేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

మద్యం లాటరీనే కారణమా..?

మద్యం టెండర్లకు సంబంధించి సోమవారం నిర్వహించిన లాటరీలో ఓ షాపు నిర్వహణకు రాఘవేంద్ర హోటల్ యజమాని దినేష్‌కు లాటరీ తగిలింది. లాటరీ టోకెన్ తమకు ఇచ్చేయాలంటూ నియోజకవర్గం ముఖ్యప్రజాప్రతినిధి సమీప బంధువు, కంబదూరు మాజీ ఎంపీపీ ఒకరు దినేష్‌ను బెదిరించినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణానికి దరఖాస్తు చేస్తే తనకు వచ్చిందని, తాను టోకెన్‌ను ఇచ్చేది లేదంటూ దినేష్ వారికి తెలియజేసినట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాన్ని వదులుకోలేదన్న కారణంతో అధికార పార్టీ నేతలు అతనిపై వేధింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అందులో భాగంగానే ఎప్పుడూ లేని విధంగా హోటల్‌పై మున్సిపల్ అధికారులు మూకుమ్మడి తనిఖీలతో బెదరగొడుతున్నారని దినేష్ మీడియా ఎదుట వాపోయాడు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా అంతటా పోలీసులు మంగళవారం ఏకకాలంలో కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఆయా సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లు, ఇతర రాష్ట్రాల మద్యం, నాటుసారా, గుట్కా నియంత్రణతోపాటు పాత కేసుల్లోని నిందితుల ఇళ్లు, పశువుల పాకలు, గడ్డివాముల ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. తర్వాత ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి ప్రశాంతంగా జీవించాలని సూచనలు చేశారు. ఎలాంటి అల్లర్లకు వెళ్లకూడదని కోరారు. మట్కా, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లు నిర్వహించారు.

గడ్డివాములను పరిశీలిస్తున్న పోలీసులు

8632 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ

అనంతపురం : జిల్లావ్యాప్తంగా 8,632 క్వింటాళ్లు పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం వరకూ 13,516 మంది పప్పుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. నమోదు చేసుకున్న రైతుల మేరకు 18,985 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయన్నారు.

చిరు జల్లులు

ప్రజాశక్తి-అనంతపురం

తుపాను ప్రభావంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంగళవారం నాడు తేలికపాటి వర్షాలు పడ్డాయి. నేడు, రేపు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు పడుతాయని రెండు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తమై ఉన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యాప్తంగా మంగళవారం నాడు తేలికపాటి వర్షాలు పడ్డాయి. చిరు జల్లులు పడ్డాయి. 0.4 మిల్లీమీటర్లు, సత్యసాయి జిల్లాలో 9.4 మిల్లీమీటర్లు నమోదయింది. యల్లనూరులో అత్యధికంగా 3.2 మిల్లీమీటర్ల వర్షం పడింది.

విద్యాసంస్థలకు నేడు.. రేపు సెలవులు

భారీ వర్షాల సమాచారం నేపథ్యంలో జిల్లాలో బుధ, గురువారాల్లో అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల సూచన నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

వర్షాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా నగరంలో ముందస్తు చర్యలు చేపట్టామని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో నగరంలో చేపట్టిన వంకల పూడికతీత పనులను మేయర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నగరంలోని వంకలు,కాలువలలో పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తుండటంతో పాటు. వంక పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అత్యవసర పరిస్థితుల్లో 08554 230234,08554 274765 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేస్తే తమ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఏదైనా సమస్య వస్తే 9849907388 వాట్సాప్ నంబర్‌కు సమాచారం పంపాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ముందస్తు చర్యలపై పలు సూచనలు చేశారన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం చేపట్టిన పూడిక తీత పనులకు 12జెసిబి లు, నాలుగు హిటాచీలు, 14 ట్రాక్టర్లు ఏర్పాటు చేసి పనులు చేపట్టారన్నారు. వర్షాల నేపథ్యంలో ఎక్కడ తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టామన్నారు. కార్మికులను నిత్యం అందుబాటులో ఉండాలని సూచనలు జారీ చేశారు. చెట్లు ఎక్కడైనా పడిపోతే వాటిని వెంటనే తొలగించేందుకు ట్రీ కట్టర్లను సిద్ధం చేశామన్నారు. నీరు నిలబడితే తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి అందుబాటులో బ్లీచింగ్ పౌడర్‌ను ఉంచామన్నారు. ఎక్కడైనా ఎక్కువ మోతాదులో నీరు నిలువ ఉంటే వాటర్ ఇండక్షన్ డీజిల్ మోటార్లను సిద్ధంగా ఉంచామన్నారు. వర్షాల వల్ల నీరు కొంత రంగు మారితే అందుకు సంబంధించిన క్లోరినేషన్ ప్రక్రియకు క్లోరిన్ ని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి కార్పొరేటర్లు సైపుల్లా ,రహంతుల్లా అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్‌హుస్సేన్ డిఈ సుభాష్ చంద్రబోస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

'పల్లె పండుగ'లో కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలోని ప్రతిగ్రామంలో ప్రతిఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్, అమిలినేని సురేంద్రబాబు కోరారు. మంగళవారం మండల పరిధిలోని వేపులపర్తి గ్రామంలో సర్పంచి రంగప్ప అధ్యక్షతన పండుగ వాతావరణంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించి ఉపాధి హామీ పనులను జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటిలో ఉన్న అందరూ పనిలో వెళ్లేటప్పుడు చూడాలన్నారు. పల్లె పండుగలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.నియోజకవర్గంలో 25 నుంచి 50 శాతం వరకూ ఉద్యానవన పంటలు కనిపిస్తున్నాయన్నారు. అంతేగాకుండా జిల్లాలో వర్షపాతం ఎక్కువగా నమోదై భూగర్భజలాలు పెరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలోని అతి ఎక్కువ హార్టికల్చర్ లక్ష్యం 35,500 హెక్టార్లు మన జిల్లాకు దక్కిందన్నారు. ఇకపోతే ప్రభుత్వం అన్నట్టు పల్లె పండుగ కార్యక్రమం పండుగలాగే ఉందని, మీద అందరితో కలవడం అలా సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో శెట్టూరు, కుందుర్తి, కంబదూరు నుంని చాలామంది భూ సమస్యలు అర్జీలతో అనంతపురం వరకూ వస్తున్నారన్నారు. వారి సమస్యలను ఇక్కడే తెలుసుకుని పరిష్కరించేందుకు కళ్యాణదుర్గంలో ఒక సోమవారం 121 మంది జిల్లా అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసే విధంగా చూస్తామన్నారు. గ్రామాలలోని ఇంటి వద్దనే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునే విధంగా కషి చేసి భూగర్భజలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణదుర్గం కరువు ప్రాంతం ఎక్కువగా ఉన్నందున పింఛన్లపై ఆధార పడుతున్నారన్నారు. అందువల్ల ప్రభుత్వం ఐదు ఎకరాలు కంటే ఎక్కువ ఉంటే పింఛన్ పంపిణీ జరగదని కాబట్టి దానిలో మార్పులు తీసుకురావాలని కోరారు. అలాగే ఈ ప్రాంతానికి సంబంధించి రోడ్లు, బ్రిడ్జిలు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయని, వాటిని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అనంతరం వరద బాధితుల సహాయార్థం వేపులపర్తి గ్రామానికి చెందిన కత్తాలి చంద్ర రూ.10వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్‌డిఒ వినూత్న, ఎస్ఇపిఆర్ అస్లాం, డిడబ్ల్యూఎంఎ పీడీ సలీంబాషా, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఎంహెచ్ ఎపిడి రమేష్‌నాయక్, హార్టికల్చర్ అధికారిణి గౌసియాబి, ట్రాన్స్‌కో ఎడి శ్రీనివాసులునాయుడు, డీఎస్పీ రవిబాబు, ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న, తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ నందకిషోర్, వైద్యాధికారి రాజేష్, వెలుగు ఎపిఎం నీలామని, ఏవో సరిత, ఆర్డబ్ల్యూఎస్ సుబ్బరాయుడు, పిఆర్ జెఇ విజయ్‌కృష్ణ, ఎంఇఒ ఓబులపతి, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, అయకట్టు ఛైర్మన్ సుభాన్, మాజీ మండల కన్వీనర్లు రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు నాగరాజు, ఓబులేష్, మండల నాయకులు వన్నూరుస్వామి, రామ్మోహన్, చితప్ప, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాల తనిఖీ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలను సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని పత్తికొండ రోడ్డులో ఉన్న బాలుర వసతిగృహం, బాలికల సమీకృత వసతి గృహం, బీసీ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి వంట గదులు, వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు ఇవ్వాల్సిన సంక్షేమాలు అన్ని అందుతున్నాయ లేదా అని వార్డెన్లను జడ్జి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఇబ్బందులను మండల న్యాయ సేవా సమితిలో ఫిర్యాదు చేస్తే తక్షణమే సహాయక చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది వీసీ.గంగాధర్ కుమార్, టైపిస్ట్ ఎస్.సాదిక్ వలి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో సమస్యలను తెలుసుకుంటున్న జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి

పలుసమస్యలపై 'కాలవ' వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఈమేరకు మంగళవారం విజయవాడలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు రాయదుర్గం ఆసుపత్రిని వంద పడకల సామర్థ్యానికి పెంచానని గుర్తు చేశారు. అప్పట్లో 22 డాక్టర్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిందని, తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కావున ఆసుపత్రికి అవసరమైన వైద్యులను నియమించాలని కోరారు.

లోకేష్‌కు వాల్మీకి చిత్రపటాన్ని అందజేస్తున్న కాలవ శ్రీనివాసులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

చిరుకాల కోరిక అయిన వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఉండవల్లిలోని సిఎం నివాసంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత టిడిపి హయాంలో వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రం, కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఉన్నందున దశాబ్దాల బోయల కల నెరవేర్చడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కణేకల్లులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. దీంతోపాటు రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాలకు కొత్త కోర్సులు మంజూరు చేయాలని విన్నవించారు.

అంగన్వాడీల ఇంటర్వ్యూలు వాయిదా

శింగనమల : నేడు నిర్వహించాల్సిన అంగన్వాడీ ఉద్యోగుల ఇంటర్వ్యూలు తుఫాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ ఉమా శంకరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శింగనమల ప్రాజెక్టు పరిధిలోని బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, శింగనమల మండలాల అంగనవాడీ ఉద్యోగుల ఇంటర్వ్యూలను తిరిగి ఈనెల 23న నిర్వహించనున్నట్లు తెలిపారు.

'పల్లె పండుగ' ఓ బోగస్ : వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ఓ బోగస్ అని వైసిపి పంచాయతీ రాజ్ అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పంచాయితీలపై చిత్తశుద్ధి లేని కూటమి ప్రభుత్వం ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా కేంద్రం కేఆయించిన నిధుల తో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. అయితే తామే చేసినట్లు కూటమి నాయకులు ప్రగల్బాలు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 4 నెలలు కావస్తున్నా చిల్లిగవ్వ నిధులు విడుదల చేసిన పాపాన పోలేదన్నారు. ఆగస్టు 15వ తేదీన జెండా పండుగకు రూ.10వేల నిధులను విడుదల చేస్తామని చెప్పి చివరకు జనరల్ ఫండ్స్ నుంచి డ్రా చేసుకోమని జీవో విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. గత వైసిపి పాలనలో దాదాపు రూ.20వేల కోట్లతో గ్రామాలను అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం పల్లె పండుగ పేరుతో వైసిపి సర్పంచులు, ఎంపిపి, జడ్పిటిసి సభ్యులను అవమానిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం ద్వారా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులు గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE Prl.DISTRICT JUDGE, ANANTAPURAMU
E.P.No.147/2023 in A.A.No.479/2022
Between:
M/s.TVS Credit Services Ltd., Chennai, Rep by its Legal Manager, Anantapuramu ...Decree Holder
And
1.Gudipalli Lakshmanna, S/o.Gudipalli Dunnappa D/o.No.2, B.C.Colony, Kalagodu, Gummagatta Mandal.
2.Gudipalli Gowramma, W/o.Boya Ningappa, D.No.2, B.C.Colony, Kalagodu, Gummagatta Mandal, Anantapuramu District.
...Judgement Debtors
NOTICE TO J.Drs
పై నెంబరు E.Pలో J.Drs అయిన మీ హాజరు నిమిత్తం 18-10-2024వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయముగా గాని లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఏమైన అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల [illegible] మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
[illegible], అడ్వకేటు,
అనంతపురము, సెల్: 9848604780

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
I.A.79/2024, I.A.80/2024, I.A.81/2024
in O.S.No.216/2008
Between:
Smt.Gouram Sakunthalamma and another ...Petitioners/Plaintiffs
And
Gouram Narayana Reddy (Died) by L.Rs Gouram Ramakrishna Reddy and Others ...Respondent/Defendants
NOTICE TO RESPONDENT No.16 and 17
R16 : G.Gangadhar Reddy, S/o.G.Ramakrishna Reddy
R17: G.Nanda Kumari, D/o.G.Rama krishna Reddy, Both are R/at.Rudrampet, Anantapuramu.
పై నెంబరు కేసులో రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం 23-10-2024వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయముగా గాని లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఏమైన అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల పైకేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
ఎస్.ఆర్.కె.మోహన్, అడ్వకేటు,
అనంతపురము, సెల్: 9440787100.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE, ANANTAPURAM
E.P.NO.617/2013 IN A.A.NO.97/2019
Between:
M/s.Shriram Finance Ltd., Guntakal Branch, Rep by its Authorised Signatory G.Raghavendra ...Decree Holder
And
1.C.Ashok Vardhan, S/o.C.Parvathappa, D.No.20-523-A, Hanumeshnagar, Guntakal, Anantapuram District.
2.P.Anjaneyulu, S/o.P.Narayanappa, D.No.17-703, Gooty Road, Guntakal, Anantapuram District.
...Judgement Debtors
వేలం ప్రకటన
[illegible] 25-10-2024వ తేది ఉదయం 10.30 గంటలకు [illegible]
షెడ్యూలు
The property situated with in the limits of Rayampalle or Rayampalle Village with in the SRO Uravakonda and RD Ananthapuramu. The details are Furnished here Under.

S.No.1	Survey Number	Extent
1.	6.F	4.25 Acres

Bounded by :
East: C.Anjnaiah Land,
West : R.Anrayanappa Land,
North: Vanka, South: R.Parvathappa Land.
ఆస్తి విలువ : రూ.21,25,000/-
DHR విలువ : రూ.8,00,000/-
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
A.PRABHAKAR REDDY, Advocate,
Anantapuram. Cell: 9441380404

ఎం.బాలాజీకి డాక్టరేట్ ప్రదానం

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సుదీర్ఘ పరిశోధన చేసిన ఎం.బాలాజీకి మంగళవారం డాక్టరేట్ మంగళవారం ప్రదాన చేసింది. తిరుపతి జిల్లా తిరుచానూరుకు చెందిన ఎ.బాలాజీ తిరుపతిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో మెకానికల్ విభాగం ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పర్యవేక్షణలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో "సీఫడ్ నూమెరికల్ సిములేషన్ ఫర్ ఇంటేక్ ఫ్లో ఫీల్డ్ డిజైన్ అండ్ ఎఫెక్ట్స్ ఆన్ కంబుషన్ అండ్ ఏమిషన్స్ అఫ్ డీజిల్ ఇంజిన్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు బాలాజీకి డాక్టరేట్ దక్కింది.

పూడికతీత పనులు పరిశీలన

నార్పల : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల వద్ద వర్షం నీరు నిలవడంతో మంగళవారం జెసిబి ద్వారా చేపట్టిన పూడికతీత పనులను మండల విస్తరణ అధికారి శైలజారాణి పర్యవేక్షించారు. పాఠశాలకు వెళ్లే రోడ్డు పక్కనే వర్షం నీరు వెళ్లే కాలువ పూర్తిగా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయి నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ సంగీతకుమారి, హెచ్‌ఎంసి కమిటీ ఛైర్మన్ రవికుమార్ విజ్ఞప్తి మేరకు పూడికతీత పనులు చేపట్టినట్లు మండల విస్తరణాధికారి తెలిపారు.

పూడిక తీస్తున్న జెసిబి

వేరుశనగ పంట తొలగించొద్దు

'పొలం పిలుస్తోంది'లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మూడు రోజులపాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వేరుశనగ పంటను తీయరాదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని 74 ఉడేగోళం రైతు సేవాకేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే తీసిన పంటను రైతులు సంరక్షించుకోవాలన్నారు. మొక్కజొన్న రైతులు సాగు చేసిన పంటను రోడ్లపై ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కందిపంట పూతదశలో ఉన్నందున సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయంతోపాటు పాడి పశువుల పెంపకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, రైతు సేవాకేంద్రం సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారి, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం : ఈ-క్రాప్ నమోదు జాబితాను రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ తెలిపారు. మంగళవారం కామారుపల్లి, చిన్నంపల్లి గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంటలకు వ్యాపించే చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి అధికారిణి హరిత, వ్యవసాయ విస్తరణాధికారి మురళీకృష్ణ, రైతు సేవాకేంద్రం సహాయకులు శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని జి.కొట్టాల, కాలాపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి లీలా వసుంధర ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ చిరంజీవి, ఎంపిఇఒ రామాంజనేయులు, రైతులు బాలిరెడ్డి, సంజీవరెడ్డి, కేశవ, నల్లపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ఈక్రాప్ నమోదు చేయించుకున్న రైతుల పేర్లను రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాప్తాడు

జిల్లాలో నెలకొన్న సాగు, తాగునీటి సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పలు సమస్యలపై సిపిఎం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సువిశాలంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లా శతాబ్దాలుగా వెనుకబడి ఉందన్నారు. ఇందుకు ప్రధాన కారణం సాగునీటి వనరులు లేకపోవడమే అన్నారు. సకాలంలో వర్షాలు రాకపోవడానికి ప్రకృతి కారణం కావచ్చు కానీ.. జిల్లాకు ఎగువ భాగాన ఉన్న తుంగభద్ర, కిందిబాగాన ఉన్న శ్రీశైలం జలాశయాల నుంచి నీటి తీసుకురావడంలో తరతరాలుగా నాయకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. జిల్లాలో కనీసం 30శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని 'జాతీయ ఇరిగేషన్ కమిషన్' 1972లోనే సూచించిందని గుర్తు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రెండు జిల్లాలుగా విడిపోయిన తర్వాత అనంతపురం జిల్లాలో నికరంగా 14లక్షల 85 వేల ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఇందులో స్థిరీకరించిన ఆయకట్టు 4524 వేల ఎకరాలు ఉందన్నారు. ఈనేపథ్యంలో జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 20వతేదీన బస్సుయాత్ర ముగుస్తుందన్నారు. యాత్రలో తెలుసుకున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో ప్రజలు, రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల అధ్యక్షులు ఎం.పోతలయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, మల్లి, రైతులు పాల్గొన్నారు.

గుంతకల్లు : జిల్లావ్యాప్తంగా సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో సిపిఎం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం బస్సుయాత్ర ఈనెల 16వతేదీన గుంతకల్లుకు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో బహిరంగ సభ ఉంటుందన్నారు. కావున రైతులు ప్రజలు భారీఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి : సిపిఎం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పామిడి : తాగు, సాగునీటి సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రను విజయవంతం చేద్దామని సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఎం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి, సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన బస్సుయాత్ర ఈనెల 17న ఉదయం పామిడికి చేరుతుందన్నారు. బస్సుయాత్రలో రైతులతోపాటు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, ముత్యాలు, ఈశ్వరయ్య, బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-యల్లనూరు

తమ గ్రామ పరిధిలో అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్‌ను వెంటనే రద్దు చేయాలని మండల పరిధిలోని చిలమకూరు గ్రామస్తులు వాపోయారు. ఈమేరకు మంగళవారం గ్రామానికి ఆనుకుని తవ్వకాలు వద్దంటూ అడ్డుకున్నారు. ఇసుక రీచ్ వల్ల తమ గ్రామం ఉనికికే ప్రమాదం ఉందన్నారు. ఎందుకంటే 2021లో పార్నపల్లి వద్ద ఉన్న చిత్రావతి రిజర్వాయర్‌కు గేట్లు ఎత్తడంతో వరద నీరు గ్రామంలోకి చొచ్చుకొచిందన్నారు. అప్పుడు పిల్లాపాపలతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లామన్నారు. ఇప్పుడు కూడా ఇసుక తవ్వితే మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చిలమకూరు వద్ద ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌ఛార్జి తహశీల్దార్ శేషారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆందోళన చేస్తున్న చిలమకూరు గ్రామస్తులు

అబ్దుల్‌కలాం జీవితం యువతకు ఆదర్శప్రాయం

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ది ఇండియాగా పేరుగాంచిన ఎపిజె అబ్దుల్ కలాం సేవలు యువతోపాటు దేశానికి ఆదర్శనీయమని జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు కొనియాడారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన కలాం భారత రాష్ట్రపతిగా ఎదిగిన తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శణీయమన్నారు. అంతేగాకుండా ఇండియా రక్షణ, పరిశోధన రంగాల్లో ఆయన కృషి భావితరాలు స్ఫూర్తి అన్నారు. ప్రపంచానికి శాపంగా మారిన వాతావరణ మార్పులను నివారించడానికి కలాం కీలకమైన సూచనలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, బి.ఈశ్వర్‌రెడ్డి, పద్మసువర్ణ, నాగప్రసాద్ నాయుడు, ఆర్.కిరణ్మయి, బి.దుర్గాప్రసాద్, సురేష్‌బాబు, పి.సుజాత, వైశాలిఘోర్పడే, ఎస్.విశాలి, ఎపి.శివకుమార్, ఎం.అంకారావు, శ్రీధర్, పిఆర్ఓ బి.ఓంప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ఎం.రామశేఖరరెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి, యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్ సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్ : దివంగత మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్‌కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. కలాం జయంతిని పురస్కరించుకుని నగర పాలకసంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో కలాం చేసిన కృషి సాటిలేనిదన్నారు. 'కలలు కనండి..సాకారం చేసుకోండి' అంటూ ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సూచన ఎందరో యువతకు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరటానికి దోహద పడిందన్నారు. అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి కార్పొరేటర్లు సైఫుల్లా, లాలూ, రహంతుల్లా, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : కలాం సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిషోర్ కొనియాడారు. కలాం జయంతిని పురస్కరించుకుని పట్టణంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షులు చల్లా రాజశేఖర్, జర్నలిస్టు లింగప్రసాద్, జెడ్పీహెచ్ఎస్ నార్త్ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులు (ఫిజికల్ డైరెక్టర్) కిరణ్, ఓబుళరాజు, కరణం మల్లికార్జున, బాబు, నరసింహులు, విజయ్‌కృష్ణ, మురళి, రోజ్లీ రాజేష్, గోళ్ల మునీర్, వెటర్నరీ మల్లికార్జున, మారుతీప్రసాద్, భగవాన్‌దాస్, బిర్యానీ రఘు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ఆర్‌డిటి కాలనీలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, సిపిఐ నాయకులు టి.ఆదినారాయణ మాదిగ, చింతా పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలు గుత్తిలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక పట్టణంలోని పెన్షనర్ల భవనంలో అబ్దుల్ కలాం చిత్రపటాన్ని ఉంచి పెన్షనర్ల సంఘం తాలూకా ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి కె. రామ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు విజయలక్ష్మి, స్వామి దాస్,వెంకటేష్, షేక్షావలి,చెన్నారెడ్డి, గోవిందప్ప,నారాయణ శెట్టి పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణం, తిప్పయ్య, ఉపాధ్యాయులు సంధ్య, భారతి, నాగవేణి, మమత, సుకన్య, శిరీషా, మాల శ్రీ, యశ్విత, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రం-1లో మండలంలోని రైతు సేవాకేంద్రాలకు సంబంధించిన గ్రామ వ్యవసాయ అధికారులకు సిఎల్ఎస్ - పిడిఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్‌పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పంటలకు ఆశించే పురుగు, తెగుళ్లపై సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాలి, పురుగు, తెగుళ్ల వ్యాధులను ఏ విధంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలనే అంశాలపై శిక్ష ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, మండల వ్యవసాయ అధికారి శైలజాకుమారి, వ్యవసాయ శాఖ అధికారి సి.చన్నవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ పప్పుశనగ పంపిణీ

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ, ఉంతకల్లు, పొన్నూరు గ్రామాల రైతులకు మంగళవారం పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి సాయికుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 670 మంది రైతులు రిజిస్ట్రర్ చేసుకోగా 718 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు ప్రదానం

అనంతపురం : అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బాలికలకు వ్యాసరచన, వకృత్వ, పెయింటింగ్, తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నగరంలోని సైన్స్ సెంటర్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిప్యూటీ డిఇఒ హెచ్.శ్రీదేవి, సైన్స్ సెంటర్ అధికారి బాలమురళీకృష్ణ, రెడ్స్ సంస్థ భానూజ, డెమో త్యాగరాజు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

అనంతపురం : దేశానికి సేవ చేసిన మాజీ సైనికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని జిల్లా మాజీ సైనికుల సంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశామన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.10లక్షల కార్పస్ ఫండ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎక్స్ సర్వీస్‌మెన్ కార్పొరేషన్ లిమిటెడ్ (అపెక్స్ కో)ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇందుకు మాజీ సైనికుల సంఘం జిల్లా నాయకులు కెప్టెన్ షేకన్న, కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, లిట్రెజరర్ తిమ్మారెడ్డి, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా దస్తగిరిస్వామి ఉరుసు

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని గుత్తి రోడ్డులో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసును మంగళవారం ఘనంగా నిర్వహించారు. హిందూ ముస్లిం ఐక్యతతో ఉత్సవాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా దస్తగిరిస్వామి పీరును గ్రామపురవీధుల గుండా ఊరేగించారు.

వర్షం నీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని వినతి

ఉరవకొండ : వర్షం నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు చేపట్టాలని నింబగల్లు గ్రామస్తులు కోరారు. మంగళవారం మండల పరిధిలోని నింబగల్లు బీసీ కాలనీవాసులు తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కాలనీలో రోడ్లు సరిగా లేనందున వర్షం నీరు ఇళ్లలోకి వస్తోందన్నారు. ఈ విషయంపై పలుమార్లు సచివాలయంలో విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జ్ఞానమూర్తి, కాలనీవాసులు సంజప్ప, పార్వతమ్మ, విరూపాక్షమ్మ, జ్ఞానేశ్వరి, గౌడ్, ఓబులేసు, సింధు, గంగమ్మ, ఎర్రమ్మ, అంపమ్మ, సుశీలమ్మ, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి పోలీస్‌స్టేషన్ తనిఖీ

గుత్తి : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ పి.జగదీష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించడంతోపాటు సీఐ, ఎస్ఐ కార్యాలయాలను తనిఖీ చేశారు. తర్వాత డీఎస్పీ ఆముదాల శ్రీనివాసులు, సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె. సురేష్ బాబు లతో ఎస్పీ నేరాల నియంత్రణపై సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. గుత్తి మున్సిపాలిటీలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ కిట్లు పంపిణీ

గుత్తి : పురపాలక సంఘంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జాతీయ సఫాయి కర్మచారి సమాఖ్య అభివృద్ధి కార్పొరేషన్ సరఫరా చేసిన పిపిటి కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ మహబూబ్ బాషా, టిపిబిఒ అప్పస్వామి, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, శానిటేషన్ కార్యదర్శి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి : ఎంపిడిఒ

ఉరవకొండ : తీవ్ర వర్షాభావం నేపథ్యంలో వైద్యసిబ్బంది మండల వ్యాప్తంగా అప్రమత్తంగా ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపిడిఒ రవిప్రసాద్ సూచించారు. మంగళవారం ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉరవకొండలోని ఎంపిడిఒ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండల పరిధిలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిఇంటికీ 10 మాత్రలతో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉచితంగా అందజేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

గుమ్మఘట్ట : ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుమ్మఘట్ట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోకపోతే రానున్న కాలంలో అనేక అనార్థాలకు దారితీస్తాయన్నారు. కావున ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్య బోధకులు లక్ష్మీనారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, సిహెచ్ఒ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఆశావర్కర్, తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్యశిబిరం

అనంతపురం : ఎపి ఎన్‌జిఒ నగర శాఖ కిమ్స్ సవేరా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉచిత గుండె, కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉద్యోగులకు ఉచితంగా జిఆర్‌బిఎస్, బిపి, ఈసిజీ, 2డి ఎకో వంటి పరీక్షలు నిర్వహించారు. ఈకార్యాక్రమంలో ఎపి ఎన్‌జిఒ నగర అధ్యక్షులు మర్రిరెడ్డి మనోహర్‌రెడ్డి, కార్యదర్శి పి.శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాసులు, రామాంజినేయులు, జాయింట్ సెక్రటరీ మహమ్మద్‌దౌలా, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాటజూదరులు అరెస్టు

యల్లనూరు : మండలంలోని పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మండలంలోని పలుచోట్ల పేకాట స్థావరాలపై దాడు చేసి ఐదుగురు నిందితులను అరెస్టు చేయడంతోపాటు 52 పేక ముక్కలు, రూ.3,4450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనంతపురం క్రైం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఇటుకలపల్లి పోలీసులు పేకాట స్థావరంపై దాడులు చేశారు. సిఐ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసులు కందుకూరు గ్రామ పొలాల్లో దాడులు నిర్వహించి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.30,190, 5 బైకులు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బెలుగుప్ప, పామిడి, రాయదుర్గం రూరల్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

పల్లెలకు మంచి రోజులు

'పల్లె పండుగ'లో వక్తలు

ఆత్మకూరు మండలం బి.యాలేరులో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెలకు మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బి.యాలేరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.36 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. అలాగే రూ.9.20 లక్షలతో ఎనుముల షెడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో బి.యాలేరులో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ముఖ్యంగా వైసిపి నాయకులు అనేక దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ నేను మాత్రం ప్రజలకు అండగా ఉంటానన్నారు. గత ఐదేళ్లలో ఇక్కడ భూములు లాక్కున్నారని, రేషన్‌కార్డులు, పింఛన్లు తొలగించారన్నారు. వీటన్నింటిని త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు. ఎస్సీ కాలనీలో తాము ఇళ్లపట్టాలు మంజూరు చేస్తే.. వాటిని రద్దు చేసి వైసిపి నాయకులు కాజేసే ప్రయత్నం చేశారన్నారు. బాధితులు కూడా పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన పరిస్థితి కూడా కనిపించిందన్నారు. ఇలాంటి ఎన్నో కష్టాలు తర్వాత మనకి మంచి రోజులు వచ్చాయన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్య తీర్చే బాధ్యత తనపై ఉందన్నారు. గ్రామంలో శ్మశానవాటికకు, పాఠశాలకు ప్రహరీ గోడలు, మూడు కమ్యూనిటీ భవనాలు, పశువుల ఆసుపత్రి నిర్మించాలని, పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, డ్వామా ఎపిడి అనురాధ, అనంతపురం డిఎల్‌డిఒ లలితాబాయి, డిఇ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : నెలరోజుల్లోనే నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీల పరిధిలో రూ.3కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని రాజీవ్‌కాలనీలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కలాం జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.70లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ ఎంపిడిఒ దివాకర్, ఎంపిపి గుజ్జల వరలక్ష్మి, రాజీవ్‌కాలనీ సెక్రటరీ రాజీవ్‌రావు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి లలిత్ కుమార్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు జయరాంరెడ్డి, నాయకులు అంకే అశోక్‌కుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, రాయల్ మురళి, సరిపూటి రమణ, సంగా తేజస్విని, సరళ, వడ్డే భవాని, కృష్ణకుమార్, రాయల్ మధు, సర్పంచి ఆశాబి, ఎంపిటిసిలు రమిజాబి, ఆశాబీ, టిడిపి నాయకులు హరికుమార్, లింగమయ్యస్వామి, ఆనంద్, డిష్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని అరకటివేముల గ్రామంలో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రూ.10లక్షల నిధులతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పల్లెల్లో అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ కలిసి గ్రామాల్లో ప్రగతికి బాటలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, తహశీల్దార్ శేషారెడ్డి, ఎపిఒ చెన్నకేశవులు, అగ్రికల్చర్ ఎడి చంగల్‌రాయుడు, ఏవో కాత్యాయని, బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఎల్కే చెన్నారెడ్డి, రామమునిరెడ్డి, గోవర్ధనరాజు, ప్రసాద్‌నాయుడు, పవన్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, వేణు, రంగయ్య, శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.12లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నెట్టెం రాంబాబు, ఎంపిడిఒ బివి రవిప్రసాద్, పంచాయతీ సెక్రటరీ రమణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలోని బెలుగుప్ప, తగ్గుపర్తి గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ ఇంజినీర్ మహమ్మద్ రసూల్, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, ఎపిఒ సూర్యప్రకాష్, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రాధాకృష్ణ, వెంకటనాయుడు, పంచాయతీ సెక్రటరీల శంకర్, శివరంజని, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

శింగనమల : మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి డేగల లలితమ్మ, అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, ఎపిఒ శ్రీదేవి, ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, ఉపాధి హామీ ఇసి దామోదర్, టిడిపి నాయకులు డేగల శ్రీనివాసులు, బాల్‌రెడ్డి, డేగల శివయ్య, శ్రీనివాసులు, లక్ష్మయ్య, గొంగటి ఓబిలేసు, మల్లికార్జున, కమ్మర నారాయణస్వామి, బండి ఎర్రిస్వామి, డేగల కిరణ్, కొయ్యగూర పెద్దన్న, ఓబుళపతి, చాకలి బాలన్న, వడ్డే నల్లప్ప, రంగనాయకులు, నాగేంద్ర, బెస్త సూర్యనారాయణ, ఓబిలేసు, రోశయ్య, సచివాలయ సెక్రటరీ నీలావతి, పంచాయతీ సెక్రటరీ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, సచివాలయ సిబ్బంది అరుణ్, ఓబిరెడ్డి, నవీన్, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని పప్పూరు, చామలూరు, దుగ్గుమర్రి గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, వైస్‌ఎంపిపి మల్లేశ్వరయ్య, ఆయా గ్రామాల సర్పంచులు స్వప్న, శివలక్ష్మి, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, శారద, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని చదం, చదం గొల్లలదొడ్డి, పల్లేపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొండన్న, టిడిపి నాయకులు పాటిల్ సదాశివరెడ్డి, పిఆర్ ఇంజినీర్ మునిస్వామి, ఇఒఆర్‌డి మురళి, ఎపిఒ విజయభారతి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.25లక్షల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, ఇఒఆర్‌డి కృష్ణకుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని మేడిమాకులపల్లి, చింతలచెరువు, చిత్రచేడు, చిట్టూరు గ్రామాల్లో మంగళవారం పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి, మండల ప్రత్యేకాధికారి వెంకటరమణనాయక్, ఎంపిడిఒ బారెన్‌సాహెట్, ఇఒఆర్‌డి నరసింహారెడ్డి, గృహ నిర్మాణశాఖ ఎఇ నెట్టికంటయ్య, ఎపిఒ పుల్లారెడ్డి, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండల పరిధిలోని తిరుమలాపురం, చిలమకూరు, అచ్యుతాపురం, కోడుమూర్తి గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్‌బాబు, ఎపిఒ షబ్బీర్, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర్, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని చెన్నంపల్లి, కెకె అగ్రహారం పంచాయతీల్లో 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి దాసరి సునతీ, సర్పంచి మల్లికార్జున ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, ఇఒఆర్‌డి సదాశివ, పిఆర్ జెఇ మద్దిలేటి, ఇంజినీరింగ్ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు క్రిష్టప్ప, జి.కుళ్లాయిస్వామి, నాయకులు మల్లికార్జునరెడ్డి, కుళ్లాయిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బుల్లే నారాయణస్వామి, గోవిందరెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

నార్పల, బుక్కరాయసముద్రం, శింగనమల, ఉరవకొండ, యల్లనూరు మండలాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ఘనంగా టిడిపి జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



వెంకటశివుడుయాదవ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు వెంకట శివుడు యాదవ్ నివాసానికి వెళ్లి భారీ కేకులను కట్ చేసి పంచిపెట్టారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ, పట్టణ, మండల అధ్యక్షులు ఎంకె.చౌదరి, బర్దివలి, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, నాయకులు జక్కలచెరువు ప్రతాప్, చెలుకూరి లక్ష్మణ్ చౌదరి,ఆర్.సాల్మన్ రాజా, చికెన్ శీనా,బి.రమేష్, ఎన్.రంగారెడ్డి యాదవ్, మాజీ కౌన్సిలర్ నంద్యాల రమేష్,నరేంద్ర చౌదరి, తెలుగు యువత నాయకుడు సుధాకర్ నాయుడు, రాజు పాల్గొన్నారు.

శింగనమల : జిల్లాకేంద్రంలోని టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన టిడిపి నాయకులు కాయల రమణాయాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.